# భార్యాభర్తల అనుబంధాన్ని వనవాసంలో శ్రీరామునికి వివరించిన సీత?

కె.ఎస్.ఎన్. శమంతకమణి కథ

## సుఖజీవన రహస్యం

తెలతెలవారుతూంది. ఇంకా సూర్యోదయం కాలేదు. వెలుగుచీకట్ల మేళవింపుతో పరిసరాలు అందంగా ఉన్నాయి. పక్షుల కలకూజితాలు శ్రావ్యంగా వినవస్తున్నాయి. ఆహ్లాదకరమైన ఉదయపుగాలి శరీరాలను మృదువుగా స్పృశించి హాయి గొలుపుతూంది. తూర్పుదిక్కు రాగరంజిత మవుతున్నది. ప్రభాత సమీరాల తాకిడికి చెట్లు అలవోకగా తలలూపుతున్నాయి. అల్లంత దూరాన రుషి వాటికలలోనుంచి వేదమంత్రపఠనం శ్రవణానందంగా వినవస్తూంది. ఆశ్రమాల పైభాగాన ఆకాశంలో హోమధూమం వలయాలు తిరుగుతూంది. ఆ ప్రత్యూష సమయపు వాతావరణమంతా మధురమనోజ్ఞంగా ఉంది.

ఆశ్రమం వాకిట ముగ్గులు పెడుతున్నది జానకీదేవి. ఆమె స్వయంగా పెంచుకున్న చిన్నపూదోట ఆ కుటీరం చుట్టూ కళలీనుతూంది. ప్రభాత సమయపు వాతావరణ మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాడు. ఆశ్రమపు అరుగుమీద కూర్చున్న శ్రీరామచంద్రుడు. అందమైన సీత— మరింత అందంగా ముగ్గులు పెడుతుంటే ఆనందంగా చూస్తున్నాడు. సోయగాల కుప్పలా ఆమె అటూ ఇటూ కదులుతూంటే నేత్రపర్వంగా ఉంది రామునికి. రకరకాల ముగ్గులువేస్తున్న ఆమె కళాభిరుచికి సంతోషంగానూ ఉంది.

"సీతా! నీకిన్ని రకాల ముగ్గులువచ్చునని నాకు తెలియదే!"— మెప్పుదలగా అన్నాడు దాశరథి. తిరిగి ఒకింత కికురింతగా "జనక



చక్రవర్తి పుత్రికకు సామాన్య కళలలో కూడా ప్రవేశమున్నదన్నమాట!" పరిహాసంగా పలుకుతున్న రాముని కనుతుదలలో చిలిపితనం తొంగిచూసింది.

సీత తలెత్తిచూసింది. చిన్నగా నవ్వింది ముగ్ధమోహనంగా. సీత నవ్వుకు పరవశించిన రాముడు లేచి ఆమెను సమీపించాడు. ఆ సమయానికి సీత తానువేసిన రంగవల్లికల

మధ్యలో నిలబడి వాటి అందాన్ని వీక్షిస్తూంది.

అడవి లోపలి సహజ ప్రకృతిలో పర్ణకుటీరం ముందు, ముగ్గుల నడుమ ముద్దబంతి పువ్వులా, అందాలరాశిలా, నవ వికసిత పద్మంలా— స్వచ్ఛంగా సుకుమారంగా, సౌందర్యదేవతలా సీత. నయనా నందకరంగా ఉన్న ఆ దృశ్యాన్ని చూస్తూ అలాగే నిలబడిపోయాడు రాముడు. సీతను చూసిన కొద్దీ అతనికి అనురాగం పొంగివస్తూంది. అది వ్యక్తం చెయ్యడానికి మాటలు దొరకడంలేదు. ప్రక్కనే పారిజాత వృక్షం క్రింద ఒత్తుగారాలిన పారిజాత పుష్పాలను దోసిలితో తీసుకుని సీత తలమీద అభిషేకించాడు శ్రీరాముడు. అతడు అతని హృదయాన్ని ఆవిష్కరించిన అద్భుతమైన ఆ తీరుకు ముగ్ధురాలై నిలిచింది సీత.

* * *

పూర్ణిమా యామినీ శశాంకుడు ఆకాశంలో వెలుగుతున్నాడు. ప్రకృతి సమస్తం వెన్నెలలో తడుస్తూంది. ఆ కుటీరం మీదా, చుట్టూ ఉన్న పూలతోట మీదా, పరిసరారణ్యం మీదా వెన్నెల కురుస్తోంది. ఆకాశం నుంచి భూమికి కురిసే వెండిరజనులా, కర్పూరపు పొడిలా, అమృతవాహిని వాకలు కట్టినట్లుగా, కామధేనువు క్షీరధారలలా ఉంది ఆ వెన్నెల. హృదయాన్ని పులకరింపజేస్తూంది ఆ దృశ్యం. ఆ వెన్నెలలో విసర్గ రమణీయమైన అరణ్య ప్రకృతి మధ్య కుటీరం వెలుపల తిన్నెమీద కూర్చుని ఉన్నారు సీతారాములు. చాలా సేపటినుంచి నిశ్శబ్దంగా కూర్చుని శరద్రాత్ర చంద్రచంద్రికా శోభలను తిలకిస్తున్న రాముడు గొంతువిప్పాడు. "అడవి కాచిన వెన్నెల అంటారు. నిజానికి వెన్నెల అడవిలో కూడా అందంగానే ఉంది సుమా సీతా! అసలు వెన్నెల అందం చూడాలంటే అడవికే రావాలేమో! ఇలా చూస్తుంటే వెన్నెల అడవిలోనే ఎక్కువ అందంగా ఉంటుందనిపిస్తోంది. అది సరే కాని సీతా! నేనో ప్రశ్న అడుగుతాను. జవాబు సరిగా చెప్పాలి. వెన్నెల అందంగా ఉంటుందా, అడవి అందంగా ఉంటుందా! సీత అందంగా ఉంటుందా? చెప్పు?" నవ్వుతూ సీతను చూస్తూ అడిగాడు శ్రీరాముడు.


ఆ ప్రశ్న సీత మనస్సును గిలిగింతలు పెట్టింది. తనూ నవ్వుతూ అంది. "ఆర్యపుత్రులు చమత్కారులేనే. ఏమో అనుకున్నాను. మాటల్లో భావుకత ప్రవహిస్తోంది" కానీ శ్రీరాముడు ఆ ప్రశ్నను వదిలిపెట్టలేదు. "వేళాకోళం కాదు సీతా, నిజంగా అడుగుతున్నాను. సమాధానం చెప్పవలసిందే. తప్పించుకోడానికి వీలులేదు" తన అందాన్ని పరోక్షంగా ప్రశంసిస్తూ అడిగిన ఆ ప్రశ్నకు జవాబు ఏమి చెప్పాలో సీతకు వెంటనే స్ఫురించలేదు. "మీరే చెప్పండి" అనేసింది "అలాకాదు, చెప్పలేనని, ఓడిపోయానని ఒప్పుకో, అప్పుడు చెబుతాను" అన్నాడు రాముడు. కవ్విస్తూ. "సరే ఓడిపోయాను చెప్పండి"

రాముడేమి చెబుతాడోనన్న కుతూహలంతో వెంటనే ఒప్పేసుకుంది సీత. విజయగర్వంతో రాముని కళ్లు తళుక్కుమన్నాయి. "ఎంతో పండితురాలవనుకున్నాను. చూశావా! చెప్పలేకపోయావు! సరే నేనే చెప్పేస్తాను విను మరి"— సీతను ఉడికిస్తూ, ఊరిస్తూ ఆఖరుకు తను చెప్పదలుకున్నది చెప్పనే చెప్పాడు రాముడు. "వెన్నెల్లో అడవిలో సీత అందంగా ఉంటుంది"

చెప్పేసి చూశావా నా ఘనత అన్నట్లు చూశాడు మురిపెంగా ఇల్లాలికేసి. అంతేకాదు, దీన్నే మరోలా చెబుతాను చూడు.

"సీత ఉన్న అడవిలో వెన్నెల అందంగా ఉంటుంది". ఇప్పుడేమంటావు అన్నట్లు చూశాడు. రాముని భావసౌందర్యానికి తన అందాన్ని అతను చెప్పక చెప్పినతీరుకు అతనికి తనమీదున్న అనురాగానికి పులకించిపోయింది సీత. భావావేశంతో ఆమె కన్నులు చెమ్మగిల్లాయి. ఆరాధనగా ప్రాణాలన్నీ కళ్లలో ఉంచి చూసింది అతని ముఖంలోకి. సీత ఒడిలో తలనుంచి శయనించాడు రాముడు. అతని చూపుల్లో నుండి వెలువడే అనురాగపు వెన్నెలలో తడుస్తున్నది సీత. ప్రణయభావ పారవశ్యంతో వారిరువురూ లోకాన్ని మరచి ఒకరినొకరు చూపులతో అభిషేకించుకుంటున్నారు.

మార్గశిరమాసపు తొలిరోజులు. చలి ప్రవేశిస్తున్నది. లక్ష్మణుడు ఆశ్రమం వద్ద కాపుండగా నదీస్నానార్థమై బయలుదేరారు సీతారాములు. దారిపొడవునా అడవిపిట్టల కలధ్వనులు చెవికి ఇంపుకలిగిస్తూ వినబడుతున్నవి. తెల్లవారుజామున ఆ చీకటిలో ఎగుడుదిగుడు దారిలో సీత చెయ్యిపట్టుకుని ఏవేవో కబుర్లు చెబుతూ నడిపిస్తున్నాడు రాముడు. ఆ చిరుచలిలో ఒకరినొకరు అంటిపెట్టుకుని నడుస్తుంటే ఇరువురి మనస్సులూ ఏదో తెలియని



విచిత్రానుభూతితో పులకిస్తున్నాయి. ఆ ఆనందం మనస్సుకో శరీరానికో తెలియని వింతమైకం ఆవరిస్తూంది. స్నానంచేసి సూర్యునికి అర్ఘ్యప్రదానం సంధ్యావం దనాదికాలు ముగించుకుని తిరిగి వ స్తుండగా—

"సీతా ఎన్నాళ్లుగానో నిన్నొక విషయం అడగాలనుకుంటున్నాను అడగమంటావా?" అప్పుడప్పుడే పరిసరాలలోకి ప్రవేశిస్తున్న చిరువెలుగులలో సీతముఖాన్ని సాలోచనగా చూస్తూ ప్రశ్నించాడు రాఘవుడు. అంగీకారభావంతో అతనివంక తన దృష్టులను బరపింది సీత. "పుట్టినది మొదలు భోగభాగ్యాలతో రాజాంతఃపురాలలో పెరిగిన దానవు. పుట్టినింటా మెట్టినింటా కూడా కష్టమంటే తెలియనిదానవు. నాతోబాటు ఈ అడవులకు వచ్చి కష్టపపడుతున్నావు. నీకు బాధగా లేదూ సీతా?" సమాధానం చెప్పమన్నట్లు సీత ముఖంలోకి సూటిగా చూశాడు రఘునందనుడు.

"అదేమిటి ఆర్యపుత్రా! మీరు మాత్రం భోగభాగ్యాలలో పుట్టి పెరిగిన రాకుమారులు కారా? అల్లారుముద్దుగా పెరిగిన మీరు అడవులలో కష్టపడడంలేదా? పట్టాభిషేక వార్త విన్నప్పుడు ఎంత ప్రసన్నంగా ఉన్నారో వనవాసాజ్ఞ విన్నప్పుడూ అంతటి శాంతచిత్తంతోనూ ఉండగలిగిన మీ ధీరత్వం— మీ భార్యనైన నాకు ఆదర్శం కాదా?" ప్రశంసంగా భర్తవం క చూస్తూ అంది సీత.

"ఈ ప్రశంసా వాక్కులకోసం నిన్ను నేను ప్రశ్నించలేదు సీతా! నీ మనస్సులో నా స్థానం ఉన్నతమని నాకు తెలుసు. కానీ నేనడిగినది వేరు. నేనాలోచించేది నా గురించి కాదు, నీ గురించి రాజభవనాలలో సుఖంగా గడపిన నువ్వు నా కారణంగా ఈనాడు అడవులలో పడరాని పాట్లు పడుతున్నావు. నిన్ను నేనుకష్టాలపాలు చేశాను. నిజం చెప్పు సీతా! నువ్వు యదార్థంగా సంతోషంగా ఉన్నావా? నాతో నువ్వు సుఖంగా ఉండగలుగుతున్నావా?" శ్రీరాముని కంఠంలో ఆవేదన సుళ్లు తిరిగింది. ఆయన హృదయంలో బాధ ముఖంలో ప్రతిఫలించింది.

"నిన్ను పెళ్లిచేసుకుని అన్యాయం చేశాను సీతా!" ఆ జగదేక ధనుర్ధరుని కంఠం జీరపోయింది. వదనం మ్లానమైంది. దిగులుతో చెన్ను తరిగిన ఆయన ముఖాన్ని పరిశీలనగా చూచింది సీత.

సహజంగా గంభీర స్వభావుడూ మితభాషీ అయిన ఈ ఉత్తముడు తన భావావేశాలను ఎవరివద్దనూ బయల్పరచుకొనడు. ఒక్క తనముందు తప్ప. తాను అతనికి భార్యేకాదు, స్నేహితురాలు కూడా. ఆయన మనసెరిగిన కూరిమినెచ్చెలియైన తనతో మాత్రమే మనసు విప్పి చెబుతాడు. ఆవిషయం తనకు తెలుసు. ఇతరుల ముందు ఎల్లప్పుడూ ఆయన సడలని గాంభీర్యంతో ప్రసన్న దరహాసిత వదనంతోనే కన్పట్టుతాడు తప్ప మరొకలా కాదు. నిత్యమూ పెదవిదాటని చిరునవ్వుతో ఉండే ఆయన ఈనాడెందుకో కలత చెందుతున్నాడు. ధీరుడైన

ఆర్యపుత్రుని మనసు ఒక్కక్షణం వశంతప్పి అతలాకుతల మవుతున్నది. ఈ సమయంలో ఆయన వెన్నుతట్టి ధైర్యం చెప్పవలసిన బాధ్యత తనమీద ఉన్నది.

"మాట్లాడవేమి సీతా! పోనీ కొన్నాళ్ళు మిథిలలో ఉండి రాకూడదూ, ఈ వనవాసక్లేశాలు తప్పుతాయి. వనవాస నియమపాలనం నాకేగాని నీకులేదు కదా!'' రాముని మాటలతో అంతవరకు ఆలోచిస్తున్న సీత ఉలికిపడి చూచింది. మెల్లగా నిశ్చలమైన కంఠస్వరంతో ప్రారంభించింది.


"ఆర్యపుత్రా! వనవాసం చెయ్యమని మీకు ఆజ్ఞ అయితే ఆ ఆజ్ఞ నాకుమాత్రం కాదా? సీతవేరూ రాముడువేరూ కాదు. ఏనాడు మా తండ్రిగారు పెట్టిన నియమం ప్రకారం శివధనుస్సు ఎక్కుపెట్టి నన్ను చేపట్టారో, కొంగు ముడివేసుకుని ఏనాడు మీతో అయోధ్యారాజాంతఃపురంలో అడుగుపెట్టానో ఆనాడే నేను మీలో భాగమయ్యాను. మిమ్మల్ని, లోకోత్తరమైన మీ నడవడిని చూసినకొద్దీ మీమీద నాకు ఆరాధనాభావం పెరిగింది. అందుకే ఆనాడు మీరు అడవికి వెళ్తున్నానని చెప్పగానే క్షణంకూడా ఆలోచించకుండా మీరు వద్దన్నా వినక పట్టుబట్టి మీతోవచ్చాను. భోగభాగ్యాల కోసమే తాపత్రయపడితే నేను మీతో రాకుండా అక్కడే ఉండిపోతే సరిపోయేది కదా!

ప్రాణనాయకా! ఎన్నిభోగభాగ్యాలయితే మీతో సమానమవుతాయి!

మీరూ నేనూ కలిసి ఉండడంకంటే ఏ సిరిసంపదలూ అధికం కాదు నాకు.

అయినా రాఘవా! ఒక రహస్యం చెప్పనా? సుఖసంతోషాలనేవి అయోధ్యలోనూ లేవు, అడవిలోనూలేవు. అవి మన భావనలో ఉంటాయి. సిరిసంపదలెన్ని ఉన్నా భార్యాభర్తల మధ్య అవగాహన, అన్యోన్య భావమూ లోపించినట్లయితే వారి మనస్సులకు సుఖశాంతులు ఉండవు. అన్యోన్య ప్రేమానురాగాలు కలదంపతులు నట్టడవిలో ఉన్నా వలపుపంటలు పండించుకోగలరు. ఈ రహస్యం తెలియకే చాలామంది అల్పవిషయాల కోసం తాపత్రయపడి జీవితంలో విలువైన వాటిని పోగొట్టుకుంటారు.

సుఖాన్ని పంచుకోవడంలోనే ఆనందం ఉందని అనుకుంటారు- కానీ కష్టాన్ని పంచుకోవడంలో అంతకుమించిన ఆనందం ఉందని చాలామందికి తెలియదు. జీవితంలో సంభవించిన కష్టాల్ని భార్యాభర్తలిద్దరూ



**కారణం**

సుబ్రమణ్యం నిర్మించిన సినిమా శతదినోత్సవం చేసుకుంది.

"మీ చిత్రం వందరోజులు ఆడడానికి కారణం ఏమిటంటారు. డైరక్షనా? నటనా? కథా?" అడిగారు విలేకరులు.

"ఇవేవీ కావు. ప్రేక్షకుల ఓర్పు" నిర్మొహమాటంగా చెప్పాడు నిర్మాత సుబ్రమణ్యం.

—కంబోతు శివలత (ఉలవపాడు)

ఓరిమితో కలిసి పంచుకోవడంలో వారిమనసులు ఎన్నడూ విడిపోనంతగా దగ్గరౌతాయి.

పన్నెండేళ్లపాటు అయోధ్యలో మీ అనురాగంలో తేలియాడిన నా మనసు తుష్టమైన సౌఖ్యాల కోసం మిమ్మల్ని విడిచి ఉండడానికి సమ్మతిస్తుందా? అయినా, ఇలా అంటున్నారుకాని, మీరు మాత్రం నన్ను విడిచి ఉండగలరా? మీ మనస్సు నాకు తెలియదనుకున్నారా ఆర్యపుత్రా? మీరులేని స్వర్గం కూడా నాకు అవసరంలేదు. నేను లేనిదే మీరు స్వర్గంలో కూడా సుఖంగా ఉండలేరని నాకు తెలుసు. మనం జీవితాంతమూ ఆనందంగా ఉండడానికి ఈ అన్యోన్య భావన చాలు. ఇంకే రాజభోగాలూ అవసరం లేదు. పద్నాలుగు సంవత్సరాలు మాత్రమే కాదు, మీతో జీవితాంతమూ అడవులలో ఉండడానికి కూడా నాకు చింతలేదు'' భావోద్వేగంతో చెబుతూ ఆగింది సీత.

''నిర్మలాంతః కరణం కల నీలాంటి భార్యను పొందిన నేను చాలా అదృష్టవం తుడిని సీతా! ఇటువంటి సదవగాహన కలిగిన స్త్రీని భార్యగా పొందిన ఏ పురుషుడి జీవితమైనా ఆనందదాయకమే అవుతుంది. అయోధ్యా రాజ్యమే కాదు, సమస్త భూమండలాధిపత్యం కూడా నాకు నీతో సమానం కాదు'' ఆనందాతిరేకంతో సీత హృదయంలో తలదాచుకున్నాడు శ్రీరామచంద్రమూర్తి.



డిజైన్: వి.ఉమాకృష్ణ (సికింద్రాబాద్)